# "వింత ప్రకృతి"

శ్రీమతి
ఎ. నాగమాంబ

ఊరంతా ఒకటే గొడవ రత్నం మాయమైయిందని. ఎవరికి తోచినట్లు వారు చెప్పుకొంటున్నారు. అందులో చాలమంది ఆమెను గురించి సానుభూతిగానే మాట్లాడుకొంటున్నట్లువుంది; రత్నం పుట్టుపూర్వోత్తరాలు బాగా తెలిసిన వాళ్ళు 'మంచిపని చేసింది' అని తేలికగా అనేస్తున్నారు.

రత్నానికి తన తల్లిదండ్రులెవరో యెంత తపస్సు చేసినా తెలియలేదు యింతవరకు. తనని చేరదీసి, బ్రతుకు తెరవులను కల్పించినవాళ్లుకూడా సరిగ్గా చెప్పలేదు. ఆమె ఆమాటలు యెత్తేసరికి వాళ్ళు విననట్లుగా క్రొత్తసంగతులు చెప్పుకుపోయేవారు. వాళ్ళు అయిష్టతగా వున్నట్లు కనిపెట్టి ఆమె ఆగొడవయెత్తడం మానేసేది_గట్టిగా అడగడానికి ధైర్యం చాలక కాబోలు! వాళ్ళ యెదుట ధైర్యంతో నిలబడి ఒక్కమాట కూడ చెప్పి యింతవరకు యెరగదు పాపం! ఒక్కొక్కసారి వాళ్ళను చూచి భయపడేది కూడ. ఆవినయ విధేయతలు చూచి పొరుగింటి అమ్మలక్కలు యెంతో ఆశ్చర్యపడేవారు. కాని ఆయింట్లో వాళ్ళకుమాత్రం అది వేరువిధంగా కన్పించేది. అది రత్నం దురదృష్టం తప్ప వేరే కాదు కూడ!

రంగసాని పేరు ప్రఖ్యాతులు గడించుకొన్న వ్యభిచారిణి ఆవూళ్ళో. ఆమె మేళనాయకురాలే కాకుండా ఎన్నో మేళాలను తనద్వార నడిపించేది. ఎంతోమంది అమాయక యువతులను వ్యభిచార వృత్తిలోనికి దింపిన భారత మహిళ. త్రాగుడు కూడ ఆయింట్లో అగ్రస్థానాన్ని అలంకరించింది. ఇంక ఆగృహం శోభ యెంత గొప్పగా వుంటుందో సంస్కారహృదయులు యిట్టే ఊహించగలరని అనుకుంటున్నా. సరసులతో సరదాగా కాలాన్ని గడిపేస్తున్నారు యువతీ యువకులు - దేశ కళ్యాణానికి కారకులు.

రత్నాన్ని రంగసాని మూడునెలలు పసిపిల్లగా వున్నప్పుడు దక్షిణాదినుంచి తీసుకొని వచ్చింది. ఆమె అలాగ ఆడపిల్లల్ని కొని తెచ్చి సానులుగా తయారు చేసేది కూడ! రత్నం అంటే యేమాత్రం కూడ జాలిలేదు ఆయింట్లో. ఇంట్లో యావత్తు చాకిరీ ఒక్కతే చేయాలి. ఆనందం అనేది నాటివరకు ఆపిల్ల అనుభవించలేదు. ఆపూటకు కడుపు నిండితేనే చాలు అదే ఆనందం ఆ అనాధకు.

అసలు చిన్నప్పటినుంచి రత్నానికి ఆవాతావరణం అంటే యెంతో అసహ్యపడేది. త్రాగుడు మైకంలో స్త్రీలు పురుషులు యెంత అసహ్యంగా ప్రవర్తించేవారో ఆమెకు తెలుసు. చూడలేక కన్నీటితో కళ్ళను కూడ మూసికొనేది. అటువంటి యింట్లో వుండేదానికంటే చస్తేమేలు అని

ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నింప బోయిందికూడ. కాని చావంటే భయం - బ్రతుకంటే ఆశ.

వచ్చే పోయే మొగవాళ్ళకు వెట్టిచాకిరీ చేయడంతో ఆమెరోజులు గడిచిపోయాయి. యవ్వనంతో తొణికిసలాడుతున్న తన మాధురీ విగ్రహాన్ని అపవిత్రం చేస్తుందేమో అని యెంతో బాధపడేది. కాని తనకు ధిక్కరించే అధికారం మాత్రం యెక్కడిది? చుట్టు ప్రక్కల వాళ్ళు అందరూ అనడం మొదలుపెట్టారు. 'నిన్ను కూడ సానిగా చేస్తుంది' అని - వూళ్ళో విలాస పురుషులు 'క్రొత్తపిట్ట' తయారయిందని వువ్విళ్ళూరుతూ వుండేవారు.

ఆనాడు వివాహం జరగడంతో రత్నం తనకు అపూర్వ భవిష్యత్ వుందని వూహించింది. తనలాగే యీ భోగంకులం లోని యువతులందరకూ వివాహాలు జరిగితే యెంతో బాగుపడేది దేశం అని అనుకునేది.

వ్యభిచారం కులవృత్తి అని అంటగట్టారు పెద్దలు. పురాణాలు, వేదాలు కూడ చెప్తున్నాయట కూడ అలాగని. దేవలోకంలోనే వున్నప్పుడు యిక భూలోకసంగతి ఆలోచించడం అనవసరం. యీ వ్యభిచారంవల్ల యెంతమంది యువతీ యువకులు పాడైపోతున్నారో ప్రభుత్వం ఊహించదు. అయినా ప్రభుత్వం కూడ యేం చేయగలదు? అని ప్రశ్నించుకోవడం కూడ కొంత అజ్ఞానాన్నే సూచిస్తుంది. దేశంలో ప్రజలందరికీ సమానమైన సామాజిక పరిస్థితుల్ని కల్పించి కొంతవరకు యీ వ్యభిచార రాక్షసిని రూపుమాపవచ్చు! అన్నిటికీ ముఖ్యంగా ప్రజలలో నైతిక పరివర్తన కలగాలి.

తనకు వివాహం అయిందని యెంతో ఆనందించింది. కాని ఆ ఆనందం యెంతో కాలం వుండలేదు. భర్త తను అనుకున్నట్లుగా లేదు. సోమరిపోతు, చదువు రాని మొద్దు, అజ్ఞాని, త్రాగుబోతు. రంగసాని యితన్ని తనకు సరసులను తీసుకొని రావడానికి, మేళాల్లో హార్మోనీ వాయించడానికి పనికొస్తాడని, యింట్లోపడి చెప్పినట్లుగా చాకిరీ చేస్తాడని యేదో వూరు నుంచి తీసికొని వచ్చింది. రత్నం మొదలో ఉరిత్రాడు వేసింది. రత్నం అతన్ని మంచి మార్గంలో పెట్టడానికి యెంతో ప్రయత్నించింది. కాని సాగలేదు.

ఇటువంటి యువకులు వందలకొలది వున్నారు నేడు దేశంలో! మేళాలు, వ్యభిచారానికి, దాని అభివృద్ధికి ఉపయోగపడడం తప్ప, వేరే కళాభివృద్ధికి సహాయపడడంలేదు. నీతి నియమంలేకుండ నాట్యకళను ఖూనీ చేస్తున్నాయి యీ భోగం మేళాలు - వీటిని అరికట్టలేకపోతున్నారు నేటి నాటకకళాకోవిదులు.

ఆ రోజు కారోజు ఎక్కువయ్యాయి రత్నానికి కష్టాలు. శాంతి, సుఖం లేదు. మొగుడు తనవాడు కాడు. రంగసాని చేతిలో కీలుబొమ్మ. తన శీలానికికూడ భంగం కల్గుతుందని ఎంతో భయంకూడ ఎక్కువైంది.

స్వేచ్ఛగా ఎక్కడయినా దాసీపనిచేసి బతకాలని నిర్ణయించుకుంది. ఆ రాత్రే బయల్దేరింది. ఎవరితో చెప్పకుండ వచ్చేసింది పట్నం. ఎక్కడా పని దొరకలేదు. కూలిపని చేయడం మొదలు పెట్టింది. స్వేచ్ఛాజీవితంలో ఆమె శరీరశోభ మరింత క్రొత్తదనాన్ని చేకూర్చుకొంది. మిసమిస లాడుతున్న నవయౌవనంతో ఆకర్షణీయంగా వుంది.

బ్రతుకు రోజు రోజుకీ బరువైపోతోంది. కూలీలు ఎక్కువైపోతున్నారు. పనులు చెప్పేవాళ్ళు తక్కువ; ఒకపూట కూడ అన్నం కడుపారతిని ఎరుగదు యింతవరకు. మళ్ళీ దుఃఖ సముద్రంలో పడింది. భరించలేకపోయింది కష్టాల్ని; జీవితంలో సుఖించే రోజులు లేవు; నిరాశ నిస్పృహ, ఆవేదన ఆందోళన మన్నూ మిన్నూ కలసినట్లుగా ముట్టడించాయి; ఆకలి బాధ ఎక్కువైంది.

అర్ధరాత్రి బజారు సందడి లేదు. నిర్మానుష్యమైపోయింది క్షణ క్షణానికి! మబ్బులు; తల దాచుకోవడానికి చోటు లేదు; ఆకలితో అలమటించిపోతోంది. ఆత్మహత్యకంటే మార్గం లేదు; భయంకరమైన హోరుతో గంభీరంగా వరదలతో ప్రవహిస్తోంది గౌతమీనది. ఉరకబోయింది గోదావరిలోనికి! ఎవరో చేయి పట్టుకున్నారు హఠాత్తుగ. వంద రూపాయలు కాగితం ఆకాశం మెరుపుల్లో మెరిసింది; పురుషుడి ఒడిలో వాలింది. ధనాశ! వ్యభిచార రాక్షసికి గురి అయింది.

పాత్రుడు గారి
బాలసంజీవిని (Regd)
పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును
డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,
19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 85254.
కుంభకోణము బ్రాంచి : 1. సారంగపాణి కోవిల, తూర్పువీధి.
తిరుచినాపల్లి బ్రాంచి : 15 పుగళియపిళ్లైవీధి, తెప్పకుళం. P. O.
అన్ని మందుల షాపులలోను దొరకును.